
# ప్రజాశక్తి

శుక్రవారం 27 జూన్ 2025

5

పార్వతీపురం మన్యం

## జీడీ ప్రాసెసింగ్ యూనిట్‌ను పిఒ తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని జీడీపప్పు ప్రాసెసింగ్ యూనిట్, మండల స్థాయి నిత్యావసర సరుకుల గోదామును ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములో జీడిపప్పు ప్రాసెసింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. జీడిపిక్కలను స్టాక్ మేరకు రిజిష్టర్లలో నమోదు చేసే ప్రక్రియను తనిఖీ చేశారు. జీడి ప్రాసెసింగ్ పక్కాగా జరగాలని, విడివికెలు నిర్వహించుకునేలా శిక్షణ ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తొలుత పట్టణంలోని నిత్యావసర సరుకుల మండల స్థాయి గోదామును సందర్శించి, అక్కడి రిజిష్టర్లను, స్టాక్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు జారీచేశారు. ఈ పర్యటనలో ఎపిడి ఎ.మురళీధర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏముంది.. ఏడాది పాలనలో ?


- పారిశ్రామిక, సాగునీటి ప్రాజెక్టుల ప్రగతి నిల్
- ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడ సమస్యలు అక్కడే
- నేడు ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. గడచిన ఏడాది కాలంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి ఏమిటనేది అవలోకనం చేసుకుంటే శూన్యమనేది కనిపిస్తోంది. జిల్లాగా ఏర్పడి మూడేళ్లు దాటినా ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉండడంతో దశాబ్దాల తరబడి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ప్రభుత్వాలెన్ని మారినా గిరిజనుల తలరాతలు ఎప్పటిలాగే కనిపిస్తున్న పరిస్థితి నెలకొంది. కొత్త కొత్త సంక్షేమ పథకాల గురించి ఎన్నికల ముందు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మీన మేషాలు లెక్కించడం ప్రభుత్వాల వంతయింది. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎక్కువగా సంక్షేమ పథకాల అమలు కోసమే యోచిస్తున్న పాలకులు అభివృద్ధి కార్యక్రమాలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. విద్య, వైద్యంతో పాటు విద్యుత్, తాగు, సాగునీటి సరఫరా, రహదారుల నిర్మాణం వంటి హామీల అమలు చేయలేని స్థితికి చేరాయి. ఫలితంగా అసంపూర్తిగా పనులు పూర్తి కావడం లేదు. చేయాల్సిన అభివృద్ధి పనులు ప్రారంభం కావడం లేదు. జిల్లా ప్రధానంగా వ్యవసాయ ప్రధానమైనది. 70 శాతం మంది ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇలాంటి జిల్లాలో అసంపూర్తిగా వున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయాలి. పెండింగులో వున్న ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంది.

**అతీగతీ లేని జంఝావతి ప్రాజెక్టు**

రెండు నియోజకవర్గాల రైతులకు జీవనాడి లాంటి జంఝావతి ప్రాజెక్టు నిర్మాణానికి అతీగతీ లేని పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలొచ్చినప్పుడల్లా ఇదే ప్రధాన ఎన్నికల వాగ్దానం. అధికారంలోకి వస్తే జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేస్తామని పోటీలో ఉన్న అభ్యర్థులు హామీలివ్వడం పరిపాటిగా మారింది. 24వేల ఎకరాల భూమిని సస్యశ్యామలం చేసే ప్రాజెక్టును గత నాలుగున్నర దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఒడిశాతో వున్న జల వివాదాన్ని పరిష్కరించడానికి చొరవ చూపకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయి. ఎన్నికైన పాలక పార్టీ ఎమ్మెల్యేలు ఇలాంటి దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి చేయడం లేదు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎన్డీయే కూటమి ప్రభుత్వమే ఒడిశాలోనూ అధికారంలో ఉంది. ఒడిశాతో ఉన్న వివాదాలు పరిష్కరించుకోవాలంటే ఇదే సరైన సమయం. కురుపాం, పార్వతీపురం ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకత గురించి వివరిస్తే ఇది ఎప్పుడో పూర్తయ్యేదని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.



పూర్తి కాని జంఝావతి ప్రాజెక్టు

**కలగా మిగిలిన పూర్ణపాడు-లాబేసు వంతెన**

కురుపాం నియోజకవర్గంలో దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్నది పూర్ణపాడు- లాబేసు వంతెన. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే పదుల సంఖ్యలో గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కలుగుతుంది. గిరిజనులు తమ అటవీ ఉత్పత్తుల రవాణాకు మార్గం సులువవుతుంది. ఎన్నికల్లో ఇది కూడా ప్రధాన రాజకీయ పార్టీల కు ముఖ్యమైన ప్రచార అస్త్రంగా కనిపిస్తోంది. ఏరు దాటాక తెప్ప తగలేసే చందంగా ఎమ్మెల్యేలు ఈ సమస్య పరిష్కారం పట్ల వ్యవహరిస్తున్నారు.

**ఎక్కడ సమస్యలు అక్కడే**

జిల్లాలోని ప్రధాన రహదారులు గుంతలతో నిండి వున్నాయి. ఏళ్ల తరబడి రహదారుల నిర్మాణం స్తంభించింది. ఫలితంగా రహదారులపై ప్రయాణం నరకయాతనగా మారింది. పార్వతీపురం - రాయగడ రోడ్డు గుంతలతో నిండి పోయింది. అధికలోడులతో రాయపూర్ వెళ్ళే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు సంక్రాంతి నాటికి చూడాలని సాక్షాత్తూ సిఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. కానీ సంక్రాంతి వెళ్లి ఐదు నెలలు దాటింది. ఇంతవరకు పాడైన రహదారుల నిర్మాణం జరగలేదు. కనీసం గుంతలు పూడ్చిన దాఖలాలు లేవు. ఏడాది కాలంలో చేసిన పనులకు బిల్లులు కూడా మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. ఫలితంగా కొత్త పనులు చేయడానికి ముందుకు రాని పరిస్థితి కనిపిస్తోంది.

**పారిశ్రామిక ప్రగతి శూన్యం**

జిల్లాలో పారిశ్రామిక ప్రగతి శూన్యం. జిల్లా గా ఏర్పడిన తర్వాత ఇంతవరకు ఒక పరిశ్రమ ఏర్పాటుకు అడుగు పడలేదు. కొత్త పరిశ్రమల ఏర్పాటు సంగతి అటుంచితే వున్న పరిశ్రమలు కూడా మూతపడిన పరిస్థితి నెలకొంది. సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ మూతపడ్డంతో జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండించిన చెరుకు పంటని సుదూర ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాలూరు నియోజకవర్గంలో గల జీగిరాం జూట్ మిల్లు మూతపడి మూడేళ్ళు దాటింది. అధికారంలోకి రాగానే మిల్లు తెరిపిస్తానని స్థానిక మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు ప్రచారానికి వచ్చిన మంత్రి లోకేష్ కూడా జూట్ మిల్లు తెరిపిస్తానని భరోసా ఇచ్చారు. ఏడాది పాలన పూర్తయినా ఇంతవరకు అతీగతీ లేదు. సుమారు రెండు వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. బతుకు తెరువు కోసం వందలమంది వలస పోయారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అనేక మంది ఉపాధి కూలీలుగా మారారు. కొత్త పరిశ్రమలు రాక, వున్న పరిశ్రమలు మూతపడ్డంతో వేలాదిమంది ఉపాధి కోసం వలస పోతున్నారు.

**మున్సిపల్ వాసులకు మురుగునీరే గతి**

గత కొన్నేళ్లుగా పట్టణ ప్రజలకు మురుగు నీరే గతి అవుతోంది. తోటపల్లి జలాశయం నుంచి తాగునీటి సరఫరా చేసే పైపులైన్ వ్యవస్థ పురాతనమైనది కావడంతో చాలాచోట్ల లీకేజీల సమస్యలు వున్నాయి. దీని కారణంగా ప్రజలకు ఏళ్లతరబడి సురక్షిత తాగునీటి సరఫరా అందని ద్రాక్షలా మారింది. రూ.63 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు సిద్ధంగా ఉన్నా ప్రారంభానికి నోచుకోలేదు. మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గం ఉండడంతో అధికారపార్టీ ఎమ్మెల్యే చాలా అభివద్ధి పనులకు మోకాలడ్డుతున్న పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి చొరవ చూపడం లేదు.

# కుర్చీ కోసం కుమ్ములాట

- ఉదయం ఒకరు... మధ్యాహ్నం మరొకరు
- తలలు పట్టుకుంటున్న టి డబ్ల్యూ ఇంజనీరింగ్ సిబ్బంది

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎకు అనుబంధంగా ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ పోస్టు కోసం ఇద్దరు ఇఇలు కుమ్ములాడుకుంటున్న వైనం నెలకొంది. గురువారం ఉదయం ఇఇ కుమార్ కుర్చీలో కూర్చుంటే, మధ్యాహ్నం ఇఇ రమాదేవి కుర్చీలో కూర్చునడంతో కింది స్థాయి అధికారులు అవాక్కయ్యారు. రెండు వారాలుగా ఎవరు ఏమీ తేల్చుకోలేకపోతున్నారు. దీంతో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ సిబ్బందికి జీతాలు లేక, కాంట్రాక్టర్లకు బిల్లులు కాక, పనులు ముందుకు సాగక ఇబ్బందులు పడాల్సి పరిస్థితి నెలకొంది.



ఒకే ఛాంబర్లో ఉన్న ఇఇలు

సీతంపేట ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా రమాదేవి 2024 అక్టోబర్ 21న బాధ్యతలు స్వీకరించారు. సుమారు ఎనిమిది నెలలుగా ఆమె హయాంలో పనులు చక చక జరుగుతున్నాయి అయితే రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఇటీవల రెండున్నరేళ్ల దాటిన వారు బదిలీలకు అప్లై చేసుకోవచ్చని జీవో జారీ చేసింది. ఇందులో భాగంగా ఈనెల 9న రమాదేవిని నెల్లూరు బదిలీ చేసినట్లు జీవో నెంబర్ 82 బదిలీ ఉత్తర్వులు ప్రిన్సిపల్ సెక్రటరీ నుండి వచ్చాయి. ఆమె స్థానంలో విజయవాడ ఇంజినీరింగ్ కార్యాలయం నుంచి ఇఎస్ఎన్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇఇ రమాదేవి జూన్ 10 నుంచి 17 వరకు పిఒ అనుమతితో సెలవుపై వెళ్లారు. కుమార్ ఈనెల 11న ఇఇగా బాధ్యతలు స్వీకరించారు. కుమార్ మూడు రోజులు ఉద్యోగం చేస్తూ వ్యక్తిగత పనిపై ఆయన సెలవుపై వెళ్లారు. అనంతరం ఈనెల 18న ఇఇ రమాదేవి హైకోర్టుకు వెళ్లిగా 82 ట్రాన్స్‌ఫర్ జీవో రద్దు చేసి ఇఇ ఆమే కొనసాగాలని కోర్ట్ ఆర్డర్ తెచ్చారు. దీంతో రమాదేవి మళ్లీ ఇఇగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఇఇ కుమార్ గురువారం స్థానిక ఇఇ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో ఇఇ రమాదేవి ఉండడంతో ఇద్దరు కలిసి ఇద్దరు తమతమ ఉత్తర్వులు పట్టుకొని ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి వద్దకు వెళ్లారు. ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు కుమార్ కొనసాగాలని పిఒ సూచించారు. రమాదేవిని ప్రిన్సిపల్ సెక్రెటరీ కలవాని సూచించారు. కోర్టు తీర్పు ధిక్కరించినందున కంటెంట్ ఆఫ్ కోర్టు వేస్తామని ఆమె చెప్పారు. దీంతో ఇరు అధికారుల కుర్చీల మధ్య పోటీ ఏ స్థాయికి వెళ్లనుందో తెలాల్సి ఉంది.

# వృద్ధి రేటు పెరిగేలా ప్రణాళికలు : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం

వ్యవసాయం, దాని అనుబంధ రంగాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో వృద్ధి రేటు ఘననీయంగా పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సుపరిపాలన కార్యక్రమం నేపథ్యంలో కలెక్టర్ ప్రభుత్వ శాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నిర్దేశించిన లక్ష్య సాధన దిశగా ప్రతి ఏటా 15 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు వెళ్లేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయం, తృణ ధాన్యాలు, డ్రోన్ల వినియోగం, ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణతో అధిక ఆదాయం పొందాలన్నారు. అలాగే పాల దిగుబడి గతేడాది కంటే ఈ ఏడాది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని, పశు సంపదను ప్రోత్సహించడంతో అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా మిగిలిన అన్ని ప్రభుత్వ శాఖల వారికి నిర్దేశించిన లక్ష్యాల ప్రగతిలో వృద్ధి రేటు ఘననీయంగా పెరగాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, అటవీ, పశు సంవర్ధక, వైద్య ఆరోగ్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల అధికారులు పి.వీర్రాజు, కె.రాబర్ట్ పాల్, వై.క్రాంతి కుమార్, వై.శ్రీదేవి, జిఎపి ప్రసూన, డా.ఎస్.మన్మథ రావు, డా.ఎస్.భాస్కరరావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి ఎం.వినోద్ కుమార్, డిఆర్డిఎ, ఐసీడిఎస్ పీడీలు ఎం.సుధారాణి, డా.టి.కనకదుర్గ, వై.నాగేశ్వరరావు, పరిశ్రమల కేంద్రం ఏడీ పి.సీతారాము, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్ అధికారులు ఒ.ప్రభాకరరావు, ఎస్.రామ చంద్రరావు, డి.ఎస్.ప్రదీప్, ఎ.ఢిల్లీశ్వరరావు, పంచాయతీ రాజ్ డిఇఇ కె.సంజీవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

## కార్మికుల హక్కులకు భంగం కలిగించే
# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**జీపు జాతాలో సిఐటియు జిల్లాప్రధానకార్యదర్శి మన్మధరావు**

ప్రజాశక్తి - కురుపాం, కొమరాడ, వీరఘట్టం, పార్వతీపురంటౌన్, సీతానగరం

కార్మికుల హక్కులకు భంగం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు అన్నారు. జులై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న జీపు జాతా గురువారం కురుపాం చేరుకుంది. ఈ సందర్భంగా రావాడ జంక్షన్ వద్ద కార్మికులు, కర్షకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 12 గంటలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేస్తూ, స్కీం వర్కర్లు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఔట్‌సోర్సింగ్‌లను రెగ్యులర్ చేస్తూ అసంఘటిత కార్మికుల సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని, ఇతర కార్మిక హక్కుల కోసం జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కొమరాడ మండల కేంద్రానికి జీపు జాతా చేరుకుంది. స్థానిక బస్టాండ్ ఆవరణలో జీపు జాతా నాయకులకు కుంకం దిద్దుతూ స్థానిక స్కీం వర్కర్లు, కార్మికులు స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. అనంతరం జీపు జాతా పార్వతీపురం చేరుకుంఇ. స్థానిక పాత బస్టాండ్ వద్ద సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని, అందులో భాగంగానే ప్రజలు తమ నిరసనను పాలకులకు తెలియజేసేందుకు జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని ప్రజలకు వివరించారు. ఇందులో కార్మికులు, కర్షకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీతానగరానికి చేరుకున్న జీపు జాతాలోని సిఐటియు నాయకులకు స్థానిక కార్మికులు తిలకం దిద్దుతూ స్వాగతం పలికారు. అనంతరం బస్టాండ్ ఆవరణంలో ర్యాలీ నిర్వహించి, బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సభలో సిఐటియు నాయకులు మాట్లాడారు. అలాగే వీరఘట్టంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద గల జీపు యాత్ర చేరుకుంది. అక్కడ జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణరావు, ఉపాధ్యక్షులు వి.ఇందిర, రెడ్డి వేణు, కార్యదర్శి బివి రమణ, నాయకులు గంట జ్యోతి, బి.లక్ష్మి అంగన్వాడీ నాయకులు జె.సరోజ, రాజేశ్వరి, గౌరీమణి, గౌరి, కొమరాడ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి సిరికి అనురాధ, సుజాత, మేరీ, రామలక్ష్మి, భవన కార్మికుల సంఘం జిల్లా నాయకులు ఆర్.రాము, టి.రమేష్, సేనాపతి కృష్ణ, శంకర్రావు, వై.గౌర్నాయుడు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శారద, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ నాయకులు దుర్గ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు శాంతి కుమారి, గౌరమ్మ, విఒఎ నాయకులు భవానీ, ఆటో యూనియన్ నాయకులు రాము, ఎపి గిరిజన సంఘం నాయకులు రామారావు, రంగారావు సుబ్బారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.శివ, శంకర్రావు, ఇప్పలమ్మ, సిఐటియు సీతానగరం మండల కార్యదర్శి జి.వెంకటరమణ, శ్రామిక మహిళా సంఘ నాయకులు వి.రామలక్ష్మి. రైతు సంఘం నాయకులు బి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, వీరఘట్టం మండల కార్యదర్శి ఎన్ ప్రసాద్ రావు, ప్రసాదరావు, వై ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.




జీపు జాతాలో మాట్లాడుతున్న మన్మధరావు

## ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

వేతనాలు పెంచాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలన పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెకు ఇంజినీరింగ్ కార్మికులకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇంజినీరింగ్ కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకూ ఐక్యంగా పోరాడాలని, దీనికి తమ యూనియన్‌తో పాటు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు.

## యాత్రకు వచ్చిన వారికి ఇబ్బంది లేకుండా చూడండి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని శుక్రవారం నుంచి జరగనున్న రథయాత్ర వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండరావు అధికారులను కోరారు. యాత్ర ఏర్పాట్లు దగ్గరుండి పరిశీలించారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి సర్వేశ్వరరావుతో మాట్లాడి పలు సూచనలు, సలహాలు అందించారు, వర్షాకాలం కావడంతో రోడ్డు మరమ్మతులు చేయాలని సిబ్బందికి సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట పట్టణ పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ ఉన్నారు.



పాఠశాల ముందు బైఠాయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు

## పాఠశాలను తరలించొద్దు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని బెజ్జి గ్రామంలో గల యుపి స్కూల్‌ను పక్క గ్రామం తలవరంలో గల యూపీ స్కూలుకు తరలించొద్దని గ్రామపెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బెజ్జి పాఠశాలను తలవరం స్కూల్‌లోకి విలీనం చేయొద్దని నినాదాలు చేశారు. తమ పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో పక్క గ్రామానికి పంపించేది లేదని తల్లిదండ్రులు పిల్లలతో సహా పాఠశాల వద్ద బైఠాయించారు. పాఠశాల విలీనం చేయడం వల్ల పిల్లలు చదువులకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులు పునరాలోచించి తమ గ్రామంలోనే పాఠశాల ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## గిరిజన ప్రాంత అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గిరిజన ప్రాంతాల్లో అన్ని సేవలు, సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని పాలేం గ్రామంలో జుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనారోగ్యంతో ఉన్న పలువురు గిరిజనులకు మలేరియా నిర్ధారణతో పాటు వివిధ రకాల పరీక్షలు చేశారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సమ్మిళిత, స్థిరమైన అభివద్ధిని సాధించడానికి దుగా కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రాంతాల్లోని సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం సురేష్ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, వైద్య, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించని అధికారులపై చర్యలు

**ఎపి వ్యవసాయ కార్మిక , ఆదివాసీ గిరిజన సంఘాలు డిమాండ్**

ప్రజాశక్తి- మక్కువ

మండలంలోని భూ సమస్యలను పరిష్కరించమని ఎన్నోసార్లు దరఖాస్తులు ఇచ్చినా స్పందించని రెవెన్యూ అధికారులపై కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు మద్దతుతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ మక్కువ మండలంలో భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 2024 అక్టోబర్‌లో ధర్నా నిర్వహించి సుమారు వెయ్యి దరఖాస్తులు సమర్పించామని తెలిపారు. వీటిలో ఇంతవరకు ఒక్క సమస్య కూడా రెవెన్యూ అధికారులు పరిష్కరించలేదన్నారు. సమస్యలు పరిష్కరించని అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలోని శంబరలో దళిత, గిరిజనులకు ఇచ్చిన డి-పట్టా భూములు పెత్తందారులు ఆక్రమించి దున్నుకుంటున్నారని, తూరుమామిడిలో సుమారు 20 ఎకరాల భూమిని ఇతర జిల్లాల వారు వచ్చి గిరిజనులకు ఇచ్చిన డి పట్టా భూములు అన్యాక్రాంతంగా సాగు చేసుకుంటున్నారని సర్వే నెంబర్లు వివరాలతో సహా ఇచ్చామని తెలిపారు. అలాగే ఎస్.పెద్దవలస గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 30 ఎకరాల భూమి దళితులకు ఇచ్చిన డి-పట్టా భూములను పెత్తందార్లు ఆక్రమించారని, వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మక్కువ మండలంలో గిరిజనులు, దళితులు, పేదలు వెంకటబైరిపురం, లోతగెడ్డ, మోసూరు వలస, మూకవలస, శంబర, కొండపల్లివలస, ఎస్ పెద్దవలస గ్రామాల్లో సుమారు వేయి ఎకరాల వరకు గత 15, 20 ఏళ్లుగా సాగు చేస్తున్నారని, వీరికి పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే అటవీ హక్కుల చట్టం ప్రకారం ఒక గిరిజన కుటుంబానికి పది ఎకరాల వరకు పోడు పట్టా ఇవ్వాలన్న ఉన్నప్పటికీ మక్కువ మండలంలో ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని అన్నారు. గిరిజనులకు ఆరెకరా, ఎకరా పట్టాలిచ్చి చేతులు దులుపుకున్నారని మిగిలిన భూమి ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున రెవెన్యూ అధికారులు స్పందించి ప్రజాసంఘాలు ఇచ్చిన దరఖాస్తులపై సర్వే చేసి సమగ్ర పరిశీలన చేసి ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న పేదలకు డిపట్టాలు ఇవ్వాలని, అన్యాక్రాంతమైన పేదల భూముల తిరిగి తీసుకొని పేదలకు పంపిణీ చేయాలని, కొండపోడు సాగు చేస్తున్న గిరిజనులకు పదెకరాల వరకు పోడు పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న కాలంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుటే రిలే నిరాహార దీక్షలకు పూనుకొని సమస్య పరిష్కారమయ్యేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పిట్టల సీతారాం, పిట్టల చినబాబు, దాడి చిన్నయ్య, అక్కాన తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు, గిరిజనులు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

# ప్రవేశాలు పెరగాలి

**ఉపాధ్యాయులను ఆదేశించిన కలెక్టర్**

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు మరింత పెరగాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. మండలంలోని అంకుళ్లవలస, రావికర్రవలస గ్రామాల్లో గల గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించిన అనంతరం ఆయన అక్కడి విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత పెరగాలని ఆదేశించారు. అలాగే గురువారం ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించామని, అందులో భాగంగా పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, ఈ విషయాన్ని తల్లితండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థులను చేర్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ప్రవేశాలు పెరగాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని, కిచెన్ గార్డెన్ నిర్వహించాలని అన్నారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ ఖచ్చితంగా కేటాయించాలని, తద్వారా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఉపాధ్యాయులకు వివరించారు. ఈ ఆకస్మిక తనిఖీలోఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దారిమల్లి ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దారిమల్లి పాఠశాలలో విద్యార్థుల ప్రవేశ ప్రక్రియను ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ఉపాధ్యాయులతో, అంగన్వాడీ, సచివాలయం సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం నగదు జమ అయ్యేలా చూడాలన్నారు. ఐదేళ్లు దాటిన ప్రతి విద్యార్థిని విధిగా పాఠశాలలో చేర్పించేలా పూర్తి బాధ్యత తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవి, జిసిడిఒ రాములమ్మ, ప్రధానోపాధ్యాయులు నారాయుడు, రామచంద్ర రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని సిఎంకు వినతి

ప్రజాశక్తి - కురుపాం


సిఎంకు వినతిని అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని వినతి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న ఏనుగుల సమస్యను పరిష్కరించాలని, కురుపాంలో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి నిధులు విడుదల, గిరిజనులకు సంబంధించి జిఒ 3 స్థానంలో ప్రత్యామ్నాయ జిఒను తీసుకువచ్చేలా కృషి చేయాలని కోరారు. అలాగే తోటపల్లి, గుమ్మిడిగెడ్డ, ఒట్టిగెడ్డ, జంఝావతి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.


ప్రారంభమైన కొత్తవార్డులు

## అందుబాటులోకి రెండు కొత్త వార్డులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఎపిడిమిక్ సీజన్‌లో జ్వరాలు అధిక సంఖ్యలో ఉండడంతో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో గురువారం రెండు కొత్త వార్డులు ప్రారంభించారు. దీంతో రోగుల సౌలభ్యం కోసం వార్డులతో పాటు మంచాలు ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఎక్కువ మందికి వైద్య సేవలందించడానికి వీలుంటుందని సూపరింటెండెంట్ తెలిపారు. అదే విధంగా సకాలంలోనే ఒకేసారి ఎక్కువమందికి రోగులకు వైద్య సేవలు అందించవచ్చని చెప్పారు.

## తాగునీటి ట్యాంకులో క్లోరినేషన్

### ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఉదయపురం పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను శుభ్రపర్చి క్లోరినేషన్ చేయించారు. స్వచ్ఛమైన తాగునీరందించాలని మండలంలోని ఉదయపురం గ్రామ గిరిజనులు కోరుతూ తమ గ్రామంలో గల తాగునీటి ట్యాంక్లు, పైపుల నుంచి పురుగులు, క్రిమి కీటకాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం 'ప్రజాశక్తి'లో స్వచ్ఛమైన తాగునీరందించండి అన్న వార్తకు ఇఒపిఆర్‌డి వై.వెంకట నాయుడు స్పందించారు. ఈ మేరకు ట్యాంకులను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## చిన్నబగ్గ కొండల్లో ఏనుగులు సంచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్నబగ్గ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వెనుక కొండల్లో ఏనుగులు సంచరించడంతో గ్రామస్తులతో పాటు విద్యార్థులు కూడా ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళలో ఎటువైపు నుంచి వస్తాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అటువైపు ఏనుగులు ఉండడంతో బీట్ అధికారి బాలి నాయుడు గ్రామస్తులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఏనుగులు ఘంకారలతో గిరిజనులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

## అశోక్ గజపతిరాజు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంలో టౌన్

టిడిపి పొలిట్‌బ్యూరోజు సభ్యుడల, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు జన్మదిన వేడుకలు విజయనగరంలోని అశోక్ బంగ్లాలో గురువారం వైభవంగా జరిగాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర పాల్గొని అశోక్ గజపతిరాజును శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆశోక్ గజపతిరాజు కేంద్రమంత్రిగాను, రాష్ట్ర మంత్రిగానూ, ఎమ్మెల్యేగాను ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి కషి చేశారని, ముఖ్యంగా తెలుగుదేశం శ్రేణులకు అండగా నిలిచారని స్పష్టం చేశారు. ఆయన టిడిపి నాయకులందరికీ ఎల్లవేళలా స్ఫూర్తిదాయకమని అన్నారు.

## మక్కువ తహశీల్దార్‌గా పైడితల్లి

ప్రజాశక్తి - మక్కువ



మండల తహశీల్దార్‌గా పి.పైడితల్లి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఆయన స్థానిక తహశీల్దార్ షేక్ ఇబ్రహీం నుంచి బాధ్యతలు స్వీకరించారు. పాచిపెంట మండలంలో సివిల్ సప్లై డిటిగా పనిచేస్తూ ఇక్కడకు తహశీల్దారుగా నియమితులయ్యారు. ప్రస్తుత తహశీల్దార్ ఇబ్రహీంకు పార్వతీపురం కలెక్టరేట్‌కు బదిలీ అయినట్లు సమాచారం.

## తహశీల్దార్‌గా రాధాకృష్ణమూర్తి

ప్రజాశక్తి - పాలకొండ



స్థానిక తహశీల్దార్‌గా రాధాకృష్ణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. తొలుత కోటదుర్గ అమ్మవారిని దర్శించుకొని బాధ్యతలు చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. సిబ్బందితో మాట్లాడి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.


## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో 20 మంది ప్రీస్కూల్ విద్యార్థులకు నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు ప్లేట్లు, గ్లాసులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లల్ని చక్కగా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అడపా బాబ్జీ ఉన్నారు.

## ఎపిఎంగా శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - పాచిపెంట



వెలుగు ఎపిఎంగా రెడ్డి శ్రీరాములు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సీతానగరం మండలం ఎపిఎంగా పని చేస్తూ సాధారణ బదిలీలో భాగంగా పాచిపెంట వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల జీవన ఉపాధి కల్పనకు కృషి చేస్తానని అన్నారు. అలాగే అప్పు తీసుకున్న ప్రతి సభ్యురాలు వృథా ఖర్చులు చేయకుండా ఆవులు, గొర్రెల పెంపకం, వ్యవసాయం, వ్యాపారంపై పెట్టుబడులు పెట్టి ప్రతి సభ్యురాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్.సిఎం వద్ద జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఐటిడిఎ పిఒ అసుతోష్ శ్రీవాస్తవతో కలిసికలెక్టర్ జెండా ఊపి ర్యాలీని లాంచనంగా ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్.సి.ఎం నుంచి బయలుదేరిన ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే మత్తు పదార్థాల పట్ల అవగాహన ఉండాలని, దీని నియంత్రణకు విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని, అప్పుడే సమాజం నుంచి డ్రగ్స్ ను పూర్తిగా రూపుమాపవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. డ్రోన్ టెక్నాలజీ, సీసీ కెమెరాలు, చెక్ పోస్టులను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల నియంత్రణపై పటిష్ట నిఘాను పెట్టినట్లు చెప్పారు. జిల్లాలో నాటు సారా కూడా ఉంటుందని, దీనికోసం నవోదయం 2.0 కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని అన్నారు. గంజాయి, నాటుసారా రహిత గ్రామాలుగా జిల్లాను తీర్చిదిద్దాలని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసేది డ్రగ్స్ అని అన్నారు. దీన్ని నివారించకపోతే యువతతో పాటు కుటుంబ వ్యవస్థ నాశనమవుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పీఓలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాలకొండ డిఎస్పీ రాంబాబు, ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఐసిడిఎస్ పిడి టి.కనకదుర్గ, తహశీల్దార్ సురేష్, పార్వతీపురం పట్టణ, గ్రామీణ, స్పెషల్ బ్రాంచ్, సైబర్ సెల్ సీఐలు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

**కురుపాం :** మాదకద్రవ్యాల నివారణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు వద్దు... జీవితమే ముద్దు అంటూ నినాదాలతో ర్యాలీగా రావాడ జంక్షన్ వరకు వెళ్లి అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.జయ, ఎస్ఐ పి.నారాయణరావు, ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి వై.వెంకట నాయుడు, ఎపిఎం బి.వెంకట్, ఎంఇఒ రాధాకృష్ణమూర్తి, ఐసిడిఎస్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**సీతానగరం :** స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి బజార్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని, మత్తు పానీయాలను దరికి చేరుకోరాదంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్, తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, ఎస్ఐ లంక శ్రీనివాసరావు, ఎక్సైజ్ సిఐ పి.పద్మావతి, వైద్యాధికారులు పి.ఉషారాణి, కళాశాల ప్రిన్సిపల్ ఎల్.దాలినాయుడు, హెచ్ఎం ఇ.ప్రసన్నలక్ష్మితో పాటు వివిధ మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మక్కువ :** జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలకు ప్రజలంతా దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం వెంకటరమణ పిలుపునిచ్చారు. యువతతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్లో మానవహారం ఏర్పడి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మల్లేశ్వరరావు, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు


ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఒ, అధికారులు

**వీరఘట్టం:** మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని వీరఘట్టంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రధాన రహదారి మీదుగా మిత్ర జంక్షన్ వరకు విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఎస్ఐ జి.కళాధర్, ప్రిన్సిపల్ డిజివిఎస్ త్రినాథ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**పాచిపెంట :** స్థానిక ఎంపిడిఒ బివిజె పాత్రో ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒ బి.అనంతలక్ష్మి, ఎస్ఐ వెంకట సురేష్, ఎంఇఒ-2 సతీష్, ఎపిఒ సత్యనారాయణ, ఆర్ఐ వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పాలకొండ :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ వేమూరి హరిగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, అధ్యాపకులు నాగభూషణరావు, విజయ కుమార్‌నాయుడు, విజయరాజ్, రవిశంకర్ పాల్గొన్నారు.

**కొమరాడ :** మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్, ఎస్ఐ కె.నీలకంఠం, ఎంఇఒ జామి నారాయణ స్వామి, సివిల్ సప్లై డిటి పకీర్, ఎపిఎం సురేష్ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు శారదాంబ, అరుణ, అంగన్వాడీ, ఆశా వర్కర్లు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓపెన్ హెడ్ ఛానల్‌పై రాజకీయ రగడ

### అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు మోహరింపు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నీలానగరం ఓపెన్ హెడ్ ఛానల్ ప్రారంభంపై రాజకీయ రగడ నెలకొంది. దీంతో మండలంలోని పివిఆర్ పురంలో భారీగా పోలీసులు మోహరించడంతో ఏమైందంటూ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజనల్ అనవాయితీగా వస్తున్న నీలానగరం ఓపెన్ హెడ్ ఛానల్ ద్వారా నీటిని విడుదల చేసేందుకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. అధికారికంగా కాకుండా, వ్యక్తిగతంగా నీటిని విడుదల చేయడమేమిటని నీటిపారుదల శాఖ అధికారులు అడ్డుకోవడంతో ఎమ్మెల్సీ, అధికారుల మధ్య వాగ్వివాదం జరిగింది. నీలానగరం ఓపెన్ హెడ్ ఛానల్ మరమ్మతుల కోసం ఇటీవల ప్రభుత్వం రూ.11 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు కూడా పూర్తి చేసినట్లు ఎఇ రమణ తెలిపారు. పనులు పూర్తయిన నేపథ్యంలో ఈనెల 28న సాగునీటి విడుదల చేసేందుకు అధికారికంగా సన్నాహాలు చేశామన్నారు. అయితే తమకు ఎటువంటి సమాచారం లేకుండా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సాగునీటి విడుదల చేసేందుకు తన అనుచరులతో వస్తున్నారని సమాచారం తెలిసిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. అధికారికంగా సాగునీటి విడుదల చేస్తామని ఇలా చేయడం సరికాదంటూ ఎమ్మెల్సీకి తెలియజేయడంతో తన కార్యకర్తలు, రైతులు, అభిమానులు, ఛానల్ వద్ద కొబ్బరికాయ కొట్టి వెనుతిరిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ రైతులకు అండగా, వారి పక్షాన నిలబడి వైసిపి పోరాడుతుందని అన్నారు. ఈ విషయంలో రాజకీయ రగడ చేస్తే తగిన బుద్ధి చెబుతామంటూ ఆయన హెచ్చరించారు. ఈ ఛానల్ పై రైతులు సొంతంగా కొంత సొమ్మును పోగుచేసి సాగునీటిని పొందుతున్నారని గుర్తు చేశారు. ఇది ఈనాటి కాలం కాదని తన తాత దండ్రుల నుంచి వస్తున్న ఆచారమని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రభుత్వ నిధులతో కాలువను బాగు చేయడం తమకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది రైతులపై ప్రభుత్వానికి ఎందుకు ఇంత ప్రేమ అని ఆయన ఎద్దేవా చేశారు. ఈ ఛానల్ పై ఆరు గ్రామాల రైతుల ఐక్యతను చిన్న భిన్నం చేసేందుకు పన్నంగా తాను అభిప్రాయపడుతున్నానన్నారు. ఆరు గ్రామాల రైతులతో సమైక్యంగా ఉన్న నేపథ్యంలో ఇటువంటి పరిమాణాలు. విడదీయలేరని ఆయన గుర్తు చేశారు. సాగునీరు అందించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఆయన ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పి విజయ కుమారి, మండల వైసిపి అధ్యక్షులు పి లక్ష్మణరావు, పరిశినాయుడు , భోగి మాణిక్య చంద్రశేఖర్, పిన్నింటి శ్రీను, శిష్టు మధుసూదన్ రావు, ఎస్ సింహాచలం రైతులు ,పాల్గొన్నారు.


ఉద్యోగులతో చర్చిస్తున్న చైర్‌పర్సన్ గౌరీశ్వరి

## సమన్వయంతో మెలగాలి : చైర్‌పర్సన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో మెలగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఒ డి.రూబెన్ తీరుకు నిరసనగా కార్యాలయంలోని మహిళా ఉద్యోగినులతో పాటు, పలువురు ఉద్యోగులు మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లుకు, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరికి ఆయనపై చర్యలు తీసుకోకపోతే తమ విధులను నిర్వహించలేమని తెలిపిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఉద్యోగులంతా తమ విధులను బహిష్కరిస్తూ కార్యక్రమాన్ని చేపట్టి కార్యాలయ ఆవరణలో నిరసన చేపట్టారు. చైర్పర్సన్ కార్యాలయానికి చేరుకుని తమ ఛాంబర్‌లో ఆర్ఒతో పాటు అన్ని విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులంతా సమన్వ యంతో మెలగాలని, వ్యక్తిగత దూషణలకు దిగొద్దని, ఒకర్ని ఒకరు కించిపర్చేలా ప్రవర్తించకూడదని సూచించారు. దీంతో మహిళా ఉద్యోగులకు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఆర్ఒ తమకు లెటర్ రూపంలో ఇవ్వాలని కోరగా, అందుకు ఆయన అంగీకరించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

## కౌలు రైతు కార్డులకు త్వరితగతిన గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి -సీతానగరం

కౌలు రైతులకు గుర్తింపు కార్డులను త్వరితగతి అందజేయాలని తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం గ్రామ రెవెన్యూ కార్యదర్శి, వ్యవసాయ శాఖ సిబ్బందితో కౌవుల రైతు కార్డులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కౌలు రైతులు కార్డులు గ్రామ రెవెన్యూ కార్యదర్శి లాగిన్‌లో ఉంటే వాటిని పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వారికి బ్యాంక్ అధికారులతో మాట్లాడి రుణాలు వచ్చేలా మండల వ్యవసాయ శాఖ అధికారి చూడాలన్నారు ఈ సమావేశంలో ఎఇ ఎస్.అవినాష్, డిటి వి.ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, పలువురు రెవెన్యూ కార్యదర్శులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# పిఎస్‌ల హేతుబద్ధీకరణకు సలహాలివ్వండి : డిఆర్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు తగిన సలహాలు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. అలాగే ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితాను తయారు చేయడంలో బిఎల్ఒలతో సహకరించాలని కోరారు. గురువారం ఆమె ఛాంబరులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా డిఇఒ లేదా ఇఆర్ఒ స్థాయిలో సమావేశాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించినట్లు తెలిపారు. డిఇఒ, ఇఆర్ఒ, బిఎల్ఒలతో సహా అధికారులంతా పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఇసిఐ జారీ చేసే నియమాలు, మార్గదర్శకాలపై తగిన సలహాలను జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నుంచి కోరుతున్నట్లు ఆమె చెప్పారు. జిల్లాలోని పోలింగ్ బూత్‌లో 800 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా ప్రతి ఓటరు నివాసం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉండేలా పోలింగ్ కేంద్రాల సమీక్ష చేపట్టాలని ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించి ప్రతి ఇఆర్ఒ రాబోయే రెండు నెలల్లోపు పోలింగ్ కేంద్రాలను విలీనం, ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రాలకు మార్చడం ద్వారా వివరణాత్మక కసరత్తు చేపట్టాల్సి ఉందన్నారు. కావున రాజకీయ పక్షాలు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ఆవశ్యకతను గమనించిన చోట్లను ఇఆర్ఒలు, జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. ఓటర్ల జాబితాలకు సంబంధించిన సూచనలు, ఓటర్ల జాబితా నాణ్యత, స్వచ్ఛతను మెరుగుపరచడానికి తగిన సూచనలు చేయాలన్నారు. ఇందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించాలని తెలిపారు. ఎన్నికల సంఘం బూత్ లెవల్ ఏజెంట్ల ఫోటోగ్రాఫ్, మొబైల్ నంబర్‌ను చేర్చడానికి ఫారమ్ బిఎల్ఎ-2కు కొన్ని సవరణలు చేసిందన్నారు. బూత్ లెవల్ ఏజెంట్ల భవిష్యత్తు నియామకాలకు ఈ సవరించిన ఫారమ్ తప్పనిసరిగా ఉపయోగించబడుతుందని నిర్ధారించుకోవాలని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న ఎడిఎ మధుసూదనరావు

## అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - మక్కువ

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని, రైతుల అవసరాలను గుర్తించి చట్టబద్ధ వ్యాపారాలను కొనసాగించాలని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.మధుసూదన్‌రావు ఎరువుల డీలర్లను హెచ్చరించారు. గురువారం స్థానిక ఎడిఎ కార్యాలయంలో నిర్వహించిన మక్కువ మండల ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, పురుగుమందులు ఎంపిఆర్‌పి దాటి అమ్మకూడదని, అలాగే అనవసరమైన ఎరువులతో ముడిపెట్టి ఇవ్వకూడదని తెలిపారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలకు సంబంధించిన లైసెన్స్ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని, ధరల పట్టికలను, స్టాకు వివరాలను షాపుల్లో ప్రదర్శించాలని సూచించారు. ప్రతి 15 రోజులకొకసారి రిపోర్టులు వ్యవసాయ కార్యాలయానికి అందించాలన్నారు. సరైన బిల్లులు రైతులకు ఇవ్వాలని, బిల్లు బుక్కులు రిజిస్టర్లు అన్నీ సర్టిఫై చేసుకోవాలని రిజిస్టర్లను కచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. ఇన్వాయిస్‌లు లేకుండా సరుకులు తీసుకురాకూడదని, బిల్లులు లేకుండా ఎరువులు రైతులకు విక్రయించకూడదని తెలిపారు. యూరియా స్థానంలో నానో యూరియా ప్రయోజనాలను రైతులకు తెలియజేస్తూ విక్రయించాలని ఈ విషయంలో వ్యవసాయ శాఖ కూడా రైతుల సమావేశాల్లో తెలియజేయాలని తెలిపారు. అనంతరం డీలర్లు మాట్లాడుతూ కంపెనీల నుంచి ఇతర సరుకులు ముడి పెడుతూ యూరియా, డిఎపిలు వస్తున్నాయని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని జిల్లా స్థాయిలో ఒక పరిష్కారాన్ని చూపించాలని కోరారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి సిహెచ్ భారతి పాల్గొన్నారు.

## చెక్ డామ్ నిర్మించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చినగోర సచివాలయం పరిధి కొండవాణి గోర సమీపాన గెడ్డ వద్ద చెక్ డాం నిర్మించాలని కొండ గొర్రె రణయ్య, బిడ్డిక ఆదినారాయణ, జీలకర్ర రమణ, బిడ్డిక సోంబాబు, గిరిజన రైతులు అధికారులను కోరుతున్నారు. ఇక్కడ చెక్ డాం నిర్మిస్తే సుమారు 100 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. తమ గ్రామానికి సమీపాన వాసవీ సంస్థ ద్వారా సుమారు రూ.36లక్షలకు పైబడి సోలార్ సిస్టం ద్వారా పైపులైను ఏర్పాటు చేసి సాగునీరందించే వారని, అయితే ఈ గెడ్డపై నీరు నిల్వ ఉండేందుకు చెక్ డాం ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యేకు, సీతంపేట ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేశసినా ఇప్పటి వరకు ఎటువంటి పనులు చేయకపోవడంతో పై నుంచి వచ్చే వరద నీరంతా వృథాగా పోతుందని వాపోతున్నారు. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ ఏ విధమైన రిగ్గు బోరులు ఏర్పాటు చేయలేదని, రెండు పైపులు ఈ గెడ్డలో పెట్టి సాగునీరు పంట పొలాలకు మళ్లించే వారని, గత ఏడాది ఏదో విధంగా పంటలు సాగైనప్పటికీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని తెలిపారు. ఈ ప్రాంతంలో రెండు పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా పూర్తిస్థాయిలో సాగునీరందించేందుకు అధికారులు చెక్ డాం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

## ఆర్‌పిలకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి పాలకొండ

మెప్మా విభాగంలో పనిచేస్తున్న 27మంది రిసోర్స్ పర్సన్లకు రూ.30వేలు ఖరీదు చేసే ట్యాబ్‌లను గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల రాజేశ్వరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ డేటా అందుబాటులో ఉండాలని ఈ ట్యాబులు అందించినట్లు చెప్పారు. నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు మాట్లాడుతూ మహిళలు టెక్నాలజీని సక్రమంగా వినియోగించుకొని ఆర్థికంగా మరింత పురోభివృద్ధి చెందాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్దపేట వేస్తుందని, కావున ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, సిటీ మిషన్ మేనేజర్ కృష్ణారావు, ఆకుల కుమార్ తదితరులు ఉన్నారు.

## కోట దుర్గ అమ్మవారిని దర్శించుకున్న జిల్లా అగ్నిమాపక అధికారి

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లా విపత్తుల స్పందన, అగ్గిమాపక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన పి.సింహాచలం కోటదుర్గ అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు చేపట్టారు.


అధికారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

## హాస్టల్ నిర్మాణ పనులను పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాల భవన నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో అందించిన వినతి పత్రానికి అధికారులు స్పందించారు. గురువారం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నిలిచిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవనిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇతర పాఠశాలలో వసతి ఉండడం పట్ల అక్కడవారు పడుతున్న ఇబ్బందులను సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు కొల్లి సాంబమూర్తి వినతిపత్రం అందజేసి సమస్యను బయటకు తెలిసేలా తెలియజేశారు. ఈ పర్యటనలో ఐటిడి అధికారులు రెవెన్యూ అధికారులు కలిసి మధ్యలో నిలిచిపోయిన వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ప్రదేశం హాస్టల్ భవనానికి ఇరుగ్గా ఉన్నందున మరికొంత ప్రదేశం హాస్టల్‌కు కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఇంజినీరింగ్ అధికారి గౌరు నాయుడు, తహశీల్దార్ సత్యనారాయణ, మండల సర్వేయర్ వంశీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ రవితేజ, సిపిఎం నాయకులు సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామారావు తదితరులున్నారు.


కాలువపై అమర్చని పలకలు

## పలకలు వేశారు... అమర్చడం మరిచారు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక శోభలతదేవి కాలనీలో కాలువపై పలకలు వేసి అమర్చడం మరిచారు. దీనివల్ల పలకలు సక్రమంగా లేకపోవడంతో రహదారి వెంట ఆదర్శ పాఠశాల విద్యార్థులు నిత్యం ఇదే రోడ్డు వెంట వెళ్తూ సైకిల్‌తో వెళ్తున్న సమయంలో పడిపోతున్న సంఘటనలో ఎన్నో ఉన్నాయి. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు కూడా ఈ దారి వెంట వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా వీధిలో చిన్న పిల్లలకు కూడా తిరుగుతుంటారని పలకలు పడిపోయి ప్రమాదం జరగవచ్చునని, కావున తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి పలకలను సక్రమంగా అమర్చి రహదారి మార్గం సులభతరం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి

**వీరఘట్టం :** నిర్ణీత సమయానికి రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను శుభ్రం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గల రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. రక్షిత మంచినీటి పథకం చుట్టు పక్కల కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబల్లే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఇఒ బి.కోటేశ్వరరావు సీనియర్ సహాయకులు వి శ్రీనివాసరావు ఉన్నారు.